


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 46 ఎడిటర్: రాపోలు లింగస్వామి 16-10-2026 శుక్రవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## రైతుకు కాసులు వర్షం కురిపిస్తున్న పూల పండుగ..!



జహీరాబాద్,: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పూల మార్కెట్ ప్రస్తుతం పండుగలతో కళకళలాడుతోంది. బతుకమ్మ,దసరా, దీపావళి పండుగలు వరుసగా రావడంతో పూలకు ఎప్పుడూ లేనంత డిమాండ్ ఏర్పడింది. దీంతో పూల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆరు నెలలు కష్టపడి పండించిన పూల రైతులకు ఇప్పుడు కాసుల పంట పండుతోంది.

**బంతి పూలకే ఎక్కువ గిరాకీ..**

బతుకమ్మ పండుగ అంటేనే పూల పండుగ. బతుకమ్మను పేర్చడానికి ప్రధానంగా బంతి పూలు, గునుగు పూలు, తంగేడు పూలు వాడతారు. ఇందులో బంతి పూలకు అధిక డిమాండ్ ఉంది. పసుపు, ఎరుపు రంగు బంతి పూలు లేనిదే బతుకమ్మ అందంగా కనిపించదు. అందుకే ప్రతి మహిళ బంతి పూల కోసం మార్కెట్ కు వస్తోంది. సాధారణ రోజుల్లో కిలో రూ.20 నుంచి రూ.30 కి అమ్మే బంతి పూలు.. ప్రస్తుతం కిలో రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. ఉదయం మార్కెట్ కు వచ్చిన పూలు మధ్యాహ్నానికే అమ్ముడైపోతున్నాయి.

**చామంతి, గులాబీకి పోటీ..**

దసరా, దీపావళి పండుగలకు చామంతి, గులాబీ పూలకు ఎక్కువ డిమాండ్ ఉంది. దేవాలయాల అలంకరణకు, ఇళ్లలో దేవుడి పూజకు, మాలలు కట్టడానికి చామంతి పూలను ఎక్కువగా వాడతారు. గులాబీ పూలను దండలు, బొకేలకు వాడతారు. ప్రస్తుతం మార్కెట్లో చామంతి పూలు కిలో రూ.120 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. తెల్ల చామంతి పూలకు డిమాండ్ ఎక్కువ ఉండటంతో రూ.160 వరకు పలుకుతోంది. ఇక గులాబీ పూలు కిలో రూ.200 పలుకుతున్నాయి. ఎర్ర గులాబీకి మరింత ధర ఉంది.

**మార్కెట్లో రద్దీ.**

జహీరాబాద్ పూల మార్కెట్లో ఉదయం 4 గంటల నుంచే వ్యాపారం మొదలవుతోంది. న్యాల్కల్, కోహిర్, ఝరాసంగం మండలాల నుంచి రైతులు పూల బుట్టలతో మార్కెట్ కు వస్తున్నారు. ఆడబిడ్డలు బతుకమ్మల కోసం, వ్యాపారులు దుకాణాల అలంకరణ కోసం పూలను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు చెబుతున్న ప్రకారం.. మరో పది రోజుల పాటు పూలకు ఇదే డిమాండ్ ఉంటుంది. బతుకమ్మ పండుగ ముగిసినా.. దీపావళి వరకు చామంతి, గులాబీ పూలకు గిరాకీ తగ్గదని అంటున్నారు.

## గతంలో 10 రోజులు సెలవులు.. ఇప్పుడు కేవలం రెండు రోజులే..!

హైదరాబాద్ : పాలిటెక్నిక్ విద్యార్థుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం పగ తీర్చుకుంటున్నది. పాలిటెక్నిక్ విద్యార్థులకు దసరా సెలవులు తగ్గించడమే ఇందుకు నిదర్శనం. ప్రతిఏటా బతుకమ్మ సందర్భంగా పాలి టెక్నిక్ విద్యా సంస్థలకు పది రోజుల పాటు సెలవులు ఇచ్చే ఆనవాయితీ ఉండేది.



కానీ ఈ ఏడాది కేవలం ఈ నెల 18 నుంచి 21వరకు మాత్రమే సెలవులు ప్రకటిస్తూ సాంకేతిక విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అందులోనూ 18న ఆదివారం,20న దసరా సెలవులు రావడంతో కేవలం రెండు రోజులే ప్రత్యేక సెలవులుగా మిగిలాయి. విద్యాశాఖ అధ్యాపక సంఘాలు తీసుకున్న నిర్ణయంపై పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. కాగా,జీవో 97 వ్యవహారంలో విద్యార్థుల పైకక్ష గట్టి ఇలాంటి నిర్ణయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతుందని ఆరోపిస్తున్నాయి. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి విజయం సాధించిన విషయం తెలిసిందే.

## పతకాలు కేవలం అంకెలు కావు.. భారత శక్తికి ప్రతీకలు

స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాలు కేవలం అంకెలకు మాత్రమే పరిమితం కాదని, అది క్రీడా రంగంలో భారత దేశ శక్తికి ప్రతీకని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆసియా క్రీడలు 2026లో పతకాలు సాధించిన అథ్లెట్లను ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ప్రధాని మోదీ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. దేశానికి కీర్తి తెచ్చిన అథ్లెట్లందరినీ అభినందిస్తూ. ఈ విజయాలు మొత్తం 140 కోట్ల మంది దేశప్రజలందరివని మోదీ స్పష్టం చేశారు.'ఈ పతకాలు కేవలం సంఖ్యలు కావు. ఇవి ఒక నూతన భారతదేశ శక్తిని ప్రతిబింబిస్తాయి. ప్రపంచ వేదికలపై మన దేశ త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగరవేయడమే అత్యున్నత విజయం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ క్రీడా వేడుకలో మహిళా అథ్లెట్లు అద్భుత ప్రదర్శన కనబరిచారని ప్రశంసించారు. మహిళా అథ్లెట్లు ఏకంగా 11 స్వర్ణాలతో కలిపి మొత్తం 38 పతకాలను సాధించడం విశేషమని ప్రశంసించారు. అలాగే క్రికెట్,హాకీ జట్లతో పాటు ఐదు స్వర్ణ పతకాలు గెలుచుకున్న ఆర్చరీ క్రీడాకారుల ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. యువ అథ్లెట్లు ప్రధానికి తమ సంతకం చేసిన జెర్సీలు, 17ఏళ్ల ఆర్చరీ క్రీడాకారిణి కుంకుమ్ మోహోద్ విల్లును జ్ఞాపికగా బహుకరించారు. దేశ క్రీడా చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని సృష్టిస్తున్న ఈ విజేతలు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ వేదికలపై మరింతగా రాణించి దేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేయాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. జపాన్ వేదికగా జరిగిన ఆసియా క్రీడలు 2026 టోర్నీలో 21 స్వర్ణాలతో సహా మొత్తం 85 పతకాలను సాధించి భారత్ అసాధారణ ప్రదర్శన కనబరిచింది.

## మతం మారితే బిసి రిజర్వేషన్ వర్తించదు

హిందూ మతంలోని వెనుకబడిన వర్గాలకు చెందిన వ్యక్తులు ఇస్లాంలోకి మారిన తర్వాతపూర్వపు హోదా ఆధారంగాబీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు పొందలేరనిసుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత సామాజిక వ్యవస్థలోని వెనుకబాటుతనాన్ని మతం మారిన తర్వాత కొనసాగించలేమని తెలిపింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలు కాకుండా ఇతర మతాలను ఆచరించే వ్యక్తినిషెడ్యూల్డ్ కులం సభ్యుడిగాపరిగణించలేమని పేర్కొంది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా,జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పు వెలువరించింది. ఇస్లాంలోకి మారిన వ్యక్తి కేవలం మతమార్పిడి ఆధారంగా బీసీ (ముస్లిం) కేటగిరీ కింద రిజర్వేషన్ కోరలేరని పేర్కొన్న మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. మతం మారిన ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన హైకోర్టు తీర్పును సమర్థించింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. మతం మారడం వల్లనే నిర్దేశిత బీసీ సమాజంలో సభ్యత్వం లభించదని,పూర్వపు కులం లేదా సామాజిక వర్గ హోదాను ముస్లిం బీసీ కేటగిరీలోకి ఆటోమేటిక్‌గా మార్చలేమని ధర్మాసనం తెలిపింది. ఇస్లాం,



క్రైస్తవం లేదా ఇతర హిందూయేతర సామాజిక వ్యవస్థలోకి మారిన తర్వాత, పూర్వపు హోదా ఆధారంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద రిజర్వేషన్ లేదా ఇతర హక్కులు కోరలేరని పేర్కొంది. ఇస్లాంలోకి మారినవ్యక్తి తమిళనాడులోని 7నిర్దేశిత బీసీసమాజాల్లో ఏదో ఒకదానికి సభ్యుడు కాలేరని స్పష్టం చేసింది. పూర్వపు సామాజిక వెనుకబాటుతనం మాత్రమే కొత్త సామాజిక వర్గంలో సభ్యత్వానికి చట్టపరమైన ఆధారం కాదని పేర్కొంది. మతమార్పిడి ఒక్కటే అర్హతగా పరిగణించరాదని తేల్చిచెప్పింది. తిరిగి హిందూ మతంలోకి వచ్చిన వ్యక్తి అర్హతను పూర్వపు హోదా ఆధారంగా మాత్రమే నిర్ణయించలేమని,అసలు కుల గుర్తింపు పునరుద్ధరించబడిందా,రాజ్యాంగ,చట్టపరమైన అర్హతలు ఉన్నాయా అనేది సమర్థ అధికారి వాస్తవాల ఆధారంగా నిర్ణయించాలని తెలిపింది. తమిళనాడు ప్రభుత్వం 2024 మార్చి9న జారీ చేసిన ఉత్తర్వులపై ఈ వివాదం ఏర్పడింది. సామాజికంగా,విద్యాపరంగా వెనుక బడిన వర్గాల వారు ఇస్లాంలోకి మారినందుకు రిజర్వేషన్ కోల్పోకూడదన్న ఉద్దేశంతో ఉత్తర్వులు ఇచ్చామని ప్రభుత్వం వాదించింది. వెనుకబడినవర్గాల కమిషన్ నివేదిక ఆధారంగా,బీసీలు,అత్యంత వెనుక బడిన వర్గాలు, డీనోటిఫైడ్ సమాజాలు, షెడ్యూల్డ్ కులాల్లోని అర్హులు ఇస్లాంను స్వీకరిస్తే బీసీ (ముస్లిం) సమాజ ధ్రువపత్రాలు జారీ చేసే అధికారం తమకుందని తమిళనాడు ప్రభుత్వం తన వాదనలో పేర్కొంది కూడా. 2015లో హిందూ మతం నుంచి ఇస్లాంలోకి మారిన సమీర్ అహ్మద్ 2016లో గెజిట్ నోటిఫికేషన్ ద్వారా మతమార్పిడిని ప్రకటించారు. రిజర్వేషన్ కోసం తనను 'ముస్లిం లబ్బై' సమాజానికి చెందిన వ్యక్తిగా గుర్తించే ధ్రువపత్రం కోరారు. జూన్ 25న మద్రాస్ హైకోర్టు ప్రభుత్వ ఉత్తర్వులను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. సుప్రీంకోర్టు ఆగస్టు 7న తీర్పును రిజర్వ్ చేసి, గురువారం హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది.

## సింగరేణి లాభాల తగ్గుదలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి

నల్లగొండ : సింగరేణి లాభాల తగ్గుదలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో లాభాల తగ్గుదల, బొగ్గు ఉత్పత్తి, విద్యుత్ సరఫరా, రైతుల సమస్యలు, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మీడియా సమావేశంలో నిలదీశారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు, విద్యుత్ రంగానికి కీలకమైన సింగరేణి సంస్థకు సంబంధించిన ఆర్థిక వివరాలను ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాలు తగ్గడానికి గల కారణాలను వివరిస్తూ పూర్తి ఆర్థిక నివేదిక, ఆడిట్ వివరాలను విడుదల చేయాలని కోరారు. పన్నులకు ముందు లాభం, పన్నుల అనంతర లాభం, ప్రొవిజన్లు, ఇతర కేటాయింపుల వివరాలను వెల్లడించాలని, కార్మికులకు లాభాల వాటా పెంపుపై పునఃపరిశీలన



జరపాలని కోరారు. సోలార్ ప్లాంట్లు, డీజిల్, డిటోనేటర్ల కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణి వాటాల విక్రయం, ప్రైవేటీకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఏమైనా ఉంటే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని,సంస్థ ప్రయోజనాలకు విఘాతం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు సింగరేణి బొగ్గు ఉత్పత్తి ఎంత మేరకు ఉపయోగపడుతోంది, ఉత్పత్తి తగ్గుదల వల్ల విద్యుత్ సరఫరాపై ఎలాంటి ప్రభావం పడుతోంది అనే వివరాలను గణాంకాలతో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహా రెడ్డి,చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఎం.డి.యూసుఫ్,జొన్నలగడ్డ రంగారెడ్డి, ఎండి.ఇలియాస్ ఖాన్, ధనావత్ బాలాజీ నాయక్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్,తదితరులు పాల్గొన్నారు.

## దసరా నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు



వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో దసరా రోజు ఓపీ సేవలు ప్రారంభమవుతాయని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాన్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 15 కల్లా పనులన్నీ పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసుపత్రిని ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. వరంగల్‌లో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి 24 అంతస్తులతో నిర్మాణం పూర్తి కావస్తోంది. గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,దనసరి సీతక్క, రాజ్యభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్ ఎలు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య,కూడా ఛైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్లు సత్య శారద, చాహత్ బాజ్పాయ్‌లు ఆసుపత్రి గదులు, ఫర్నిచర్, ఎక్విప్‌మెంట్ ఇతర వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులన్నీ తుది దశకు చేరాయన్నారు. ఆసుపత్రి పరిధిలోని ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్,మెదక్ జిల్లాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.

# సంపాదకీయం

## గరళం ఈశునికి.. గంగాళం ఏలికకు!

యోగ శాస్త్ర దర్శనంలో సహస్రారమే సదాశివుని స్థానం. అక్కడి నుంచి ప్రవహించే అమృత రసమే గంగాధార. శివుడు గంగను ధరించడం అంటే విధ్వంసాన్ని జీవన ప్రదాయినిగా.. కల్మషాన్ని పవిత్రతగా.. ఉగ్రత్వాన్ని శాంతంగా మార్చే అత్యున్నత రక్షణ తంత్రం. క్షీరసాగర మథనంలో ఉద్భవించిన ప్రాణాంతక గరళాన్ని తాను దిగమింగి లోకానికి అమృతాన్ని ప్రసాదించే త్యాగమే శివతత్వం. ప్రకృతి ప్రళయాన్ని తన శిరస్సున నిలిపి, సమస్త జీవకోటికి అమృతదాయినిగా మలచడమనే నిత్య ఓంకారేశ్వర సంకేతం. ఆ.. ఓంకారేశ్వరనాథుని ముందుపెట్టే రూ.లక్షన్నర కోట్ల నిధి కోసం హస్తం పార్టీ పాలకులు మూసీ నది మథనం మొదలుపెట్టారు. ప్రజలు, ప్రతిపక్షాలు ఒక దిక్కు.. పాలకులు మరో దిక్కు. గరళాన్ని దైవానికి నైవేద్యంగా పెట్టి..అమృత గంగాళాన్నీ దిగమింగే క్రతువుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.మూసీ ప్రాజెక్టులో కాంగ్రెస్ సర్కార్ కపటత్వాన్ని నిర్ధారిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఈనెల 7న జీవో ఆర్టీ నవంబర్ 928ని విడుదల చేసింది. మూసీ పునరుజ్జీవం పేరుతో గండిపేట మండలం మంచిరేవుల వద్ద పాలనాపరమైన అనుమతులతో ఏకంగా రూ.1108.27 కోట్లు మంజూరు చేసింది. శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రధాన ఆలయం, ఉపాలయాలు, రాజగోపురాలు, భారీ శివుని విగ్రహం, పుష్కరిణి పేరిట రూ.948.65 కోట్ల ముడుపు కట్టింద్రు. పనిలో పనిగా ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్ విండ్ విల్లాస్ మీదుగా 100 అడుగుల వెడల్పుతో 2.50 కిలోమీటర్ల ఆరు లేన్ల రోడ్డు నిర్మాణానికి మరో రూ.159.62 కోట్లు రాసిచ్చారు. ఆశ్చర్యకరమైన విషయమేమంటే రూ.1108.27 కోట్ల ఖర్చునంతా నదిని బాగుచేయాల్సిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ పద్దు నుంచే సర్దుబాటు చేశారు. నది సంస్కృతి, స్వచ్ఛతను కాపాడాల్సిన ఖాతా నుంచి కాంక్రీట్ కట్టడాలు, లగ్జరీ విల్లాల దారులకు నిధులు మళ్లించడం ఆధ్యాత్మిక ముసుగులో నయా వ్యాపారం.మూసీ సమగ్ర ప్రక్షాళన కోసం లక్షన్నర కోట్ల రూపాయల బృహత్ ప్రణాళికలు, విదేశీ బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు ఎత్తుతున్న ప్రభుత్వం, మూసీ మురుగు నీటిని వంద శాతం శుద్ధి చేసే అత్యున్నత సాంకేతిక ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి, మురుగు కాలువలను పూర్తిగా మళ్లించడానికి సమగ్ర బడ్జెట్ కేటాయింపులు చేయలేదు. కేవలం ద్వితీయ శ్రేణి శుద్ధి మాత్రమే జరిగే అరకొర ఎస్టీపీలతో నది జీవవైవిధ్యం బతకదు. నదీ పునరుజ్జీవం అంటే నదికి ప్రాణ వాయువును అందించడం. జీవశాస్త్ర పరిభాషలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ స్థాయిని కుదించటం. ఆ పనికి పూనుకున్నది కేసీఆర్ ప్రభుత్వం. హైదరాబాద్ మహానగరంలో ప్రతిరోజూ దాదాపు 1,950 నుంచి 2000 మిలియన్ లీటర్ల మురుగునీరు పారుతున్నది. తెలంగాణ రాష్ట్రం రాక ముందు నగరవ్యాప్తంగా ఉన్న పాత ప్లాంట్ల ద్వారా 330 ఎంఎల్డీ మురుగు శుద్ధి జరిగేది.బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక 772 ఎంఎల్డీలకు పెంచారు. ఈ లెక్కన ఉత్పత్తి అవుతున్న మురుగులో దాదాపు 60 శాతానికి పైగా ఎలాంటి శుద్ధి లేకుండానే నేరుగా నాలాల ద్వారా మూసీ, ఈసా నదుల్లో కలుస్తున్నది. కరెంటు కోతలు పోయి, సాగు వ్యథలు తగ్గి, తెలంగాణ రాష్ట్రం జరంత కుదుట పడ్డ తర్వాత కేసీఆర్ మూసీ మీద దృష్టి పెట్టారు.మహానగర వ్యాప్తంగా రూ 3,866 కోట్ల వ్యయంతో 31 కొత్త ఎస్టీపీల ఏర్పాటుతో 100 శాతం మురుగునీటి శుద్ధిని సంకల్పించారు. పాత ప్లాంట్ల ద్వారా 772 ఎంఎల్డీలు, కొత్త ప్లాంట్లతో 1,259.50 ఎంఎల్డీలు కలిపి మొత్తం 2032 ఎంఎల్డీల మురుగునీటి శుద్ధి కోసం నిధులు కేటాయించారు.ఆల్వాల్,కుత్బుల్లాపూర్,కాప్రా పరిసరాల్లో 8 ఎస్టీపీ లు; రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మూసీ దక్షిణ ప్రాంతాలు 6 ఎస్టీపీలు; ఎల్బీనగర్, ఉప్పల్, మూసీ ఉత్తర పరీవాహక ప్రాంతాలు 17 ఎస్టీపీల సామర్థ్యంతో మూడు ప్యాకేజీలుగా విభజించి చేపట్టారు. క్యాబినెట్ ఆమోదం పొంది పనులు వివిధ దశలకు చేరుకున్నాయి. అంతా అనుకున్నట్టు జరిగితే మల్లన్నసాగర్ నుంచి నీళ్లు తెచ్చి మూసీలో పోయాలని భావించారు. కానీ ఇంతలో ప్రభుత్వం మారింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రావడంతోనే మూసీ ప్రక్షాళన రాగం అందుకున్నది. పైసల్ లేవు లేవంటూనే లక్షన్నర కోట్ల రూపాయలకు లంగర్ ఎత్తింది. నదిని శుద్ధి చేసే పనులను పక్కన పెట్టి కాంక్రీట్ కట్టడాల కోసం ఉత్తర్వుల మీద ఉత్తర్వులు ఇస్తున్నది. మంచిరేవుల వద్ద ఏకంగా రూ 1108.27 కోట్లు మంజూరు చేసిన జీవో ఆ ప్రాంతంలో నదిలోకి వచ్చిపడు తున్నకాలుష్య జలాలను శుద్ధిచేసేందుకు ఒక్క పైసా కూడా కేటా యించకపోవడం ప్రభుత్వప్రాధాన్యతల్లోని తీవ్రమైన అసమ తుల్యతను బయటపెడుతున్నది. నదిని నిర్మలంగా మార్చే శాస్త్రీయ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు మాత్రం విదేశీ అప్పుల వేటలో అటకెక్కగా,కాంక్రీట్ కట్టడాలకు,గుడి గోపురాలకు మాత్రం ఖజానా నుంచి వెనువెంటనే వేల కోట్లు ధారపోయడం వెనుక దాగిన లోగుట్టు పాలకులే చెప్పాలి.వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో విష్ణుపాదోద్భవియై ముచుకుందా.ఉస్మాన్సాగర్ వరకు తీపి జలాల తోనే సాగుతున్నది.కానీ గండిపేట దిగువకు వచ్చేసరికి మురుగు తోడై విషం పులుముకుంటున్నది. మంచిరేవుల వచ్చేసరికి నది జీవధాతు చచ్చిపోయి సంపూర్ణ విష రసాయనాలు, మురుగు ప్రవాహంగా రూపాంతరం చెందుతున్నది. ఇక అక్కడి నుంచి మహానగరం విడుదల చేస్తున్న మురుగు మూసీలోనే కలుస్తుంది.ఆ దుర్గంధపు ఒడ్డున రూ.948.65కోట్లతో ఓంకారేశ్వ రుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించడమంటే దైవాన్ని అవమానించడం కాక మరేమిటి?ఏ శివుడిని జలాలు,పంచామృతాలతో అభిషేకిస్తరు.

## అనుభవాలే అసలైన ఆస్తులు



బ్రతకడంలో కొన్ని గాయాలను అనుభవించాలి, జీవించడంలో కొన్ని గాయాలను గుండెల్లోనే దాచుకోవాలి!
కాలం విసిరే కఠిన పరీక్షలను ఎదుర్కోవాలి, కన్నీళ్ల వెనుక దాగిన నిజాలను తెలుసుకోవాలి!
కొన్ని పాఠాలు పుస్తకాల్లో కనిపించవు, కొన్ని సత్యాలు ఉపన్యాసాల్లో వినిపించవు!
జీవితం చెంపదెబ్బ కొడితేనే అర్థమవుతాయి, విధి వెన్నుపోటు పొడిస్తేనే వెలుగులోకి వస్తాయి!
నమ్మిన మనుషులే నట్టేట ముంచినప్పుడు, నిజమైన బంధాల విలువ బోధపడుతుంది!
సొంతవారే పరాయివారై దూరమైనప్పుడు, ఒంటరితనంలోని అసలు స్వరూపం తెలుస్తుంది!
డబ్బుతో దేహానికి సుఖాలను కొనగలవు, కానీ మనసుకు ప్రశాంతతను కొనలేవు!
బంగారంతో భవనాలను నిర్మించగలవు, కానీ ఆప్యాయతలతో నిండిన ఇంటిని కొనలేవు!
అధికారంతో తలలను వంచించగలవు, కానీ హృదయాలను గెలుచుకోలేవు!
వేల నోట్లతో స్నేహాన్ని నటింపజేయగలవు, కానీ ఆపదలో నిలిచే ఆత్మీయతను సంపాదించలేవు!
కొన్ని అనుభవాలు జీవితాన్ని దహిస్తాయి, మరికొన్ని అనుభవాలే మనిషిని ఉక్కులా మలుస్తాయి!
బ్రతుకు నేర్పిన పాఠాలే మనకు నిజమైన సంపద, కొనుగోలుకు లొంగని అనుభవాలే జీవితానికి అసలైన వారసత్వం!

**రచన : ఆర్.కె.రెడ్డిగోగులపల్లి, నెల్లూరు జిల్లా.**

## మధుయాష్కి గౌడ్ ను ఘనంగా సత్కరించిన మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, అక్టోబర్ 15:ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసి, ఢిల్లీలోని ఇందిరా భవన్లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మధుయాష్కి గౌడ్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొని మధుయాష్కి గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమధుయాష్కి గౌడ్ నాయకత్వంలో ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని, దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్స్ను పార్టీ వైపు ఆకర్షించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి, డాక్టర్స్ కాలనీ డివిజన్ అధ్యక్షులు ధనరాజ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పందుల వెంకట్ గౌడ్,



రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ బొక్క భూపాల్ రెడ్డి, సరికొండ మల్లేష్ తదితర ముఖ్య నాయకులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై నిరసన ర్యాలీలో దేశ్ పాండే



సంగారెడ్డి, జ్యోతి ప్రభంజనం,ప్రతినిధి అక్టోబర్ 15: సంగారెడ్డి జిల్లా పట్టణంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ సమస్యలపై నిరసన ర్యాలీలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావ్ దేశ్ పాండే. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బస్వా లక్ష్మీనారాయణ కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, మాణిక్యరావు, రాజశేఖర్ రెడ్డి, జగన్, క్లోజింగ్ యాదవ్, వెంకట నరసింహారెడ్డి, అమ్రాది ఎల్లయ్య, భూమయ్య, రవిశంకర్, పవన్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, వివిధ మోర్చా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ

**ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఐఎఎస్.**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ, మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుక అని ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం



(ఐడీఓసీ) ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ,మెప్మా,అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొని పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు.అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోందని అన్నారు.మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రకృతిని గౌరవిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత,వైద్య ఆరోగ్య శాఖ,మెప్మా, రెవెన్యూ తదితర శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిడిపిఓలు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాన్నంటే..?

నాన్న అంటేనే ఒక ధైర్యం, నాన్న అంటేనే కొండంత బలం, నాన్న అంటేనే చీకటిలో వెలిగే దీపం, నాన్న అంటేనే జీవితానికి భరోసా!



తన కన్నీళ్లను గుండెల్లో దాచుకుని, మన కళ్లలో నవ్వులు నింపే త్యాగమూర్తి, తన ఆకలిని సైతం మరచిపోయి, మన కడుపు నింపే ప్రేమమూర్తి!
తన కలలను పక్కన పెట్టి, మన కలలకు రెక్కలు తొడిగే ఆకాశం, తన జీవితాన్నే భారంగా మోస్తూ, మన భవిష్యత్తుకు బాటలు వేసే మార్గదర్శి!
లోకం మనల్ని వేలెత్తి చూపినప్పుడు, మన తప్పులనూ క్షమించే తొలి మనిషి, ఎన్ని అపజయాలు ఎదురైనా సరే, నువ్వు గెలుస్తావంటూ భుజం తట్టే నమ్మకం!
నాన్న ప్రేమకు కొలమానం లేదు, ఆయన త్యాగానికి అంతం అనేదే లేదు, ఆయన ఉన్నంతకాలం విలువ తెలియకపోవచ్చు, ఆయన లేని లోటు జీవితాంతం తీరకపోవచ్చు!
నాన్నంటే ఒక మనిషి మాత్రమే కాదు, మన జీవితాన్ని మోసే కనిపించని దేవుడు, ఆయన నీడలో పెరిగిన ప్రతి క్షణం ఒక వరం, ఆయన ప్రేమను పొందిన జన్మే నిజమైన అదృష్టం!

**రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## చిగిరింత పారిజాత నరసింహారెడ్డికి కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్, అక్టోబర్ 15: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్



పార్టీ అధ్యక్షురాలిగా చిగిరింత పారిజాత నరసింహారెడ్డి ఇందిరా భవన్లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చిగిరింత పారిజాత నరసింహారెడ్డి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె నాయకత్వం దోహదపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ అందుగుల ప్రభావతి, మహేశ్వరం మండల క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షుడు బుసనగారి స్వామి, మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్ర నవీన్ కుమార్, మహేశ్వరం మండల ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షుడు బాట రాజు, పలువురు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## సైదాబాద్ పోలీసుల చొరవ.. 38 మొబైల్ ఫోన్లు రికవరీ

సైదాబాద్, జ్యోతి ప్రభంజనం, సైదాబాద్ ఏసీపీ పర్యవేక్షణలో సైదాబాద్ డీఐ, పోలీసు సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో పోగొట్టుకున్న



38 మొబైల్ ఫోన్లను గుర్తించారు. బుధవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో గుర్తించిన మొబైల్ ఫోన్లను సంబంధిత యజమానులకు తిరిగి అందజేశారు.మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వాటిని తిరిగి అందించేందుకు పోలీసులు చేపట్టిన చర్యలపై యజమానులు హర్షం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించిన సైదాబాద్ పోలీసు బృందాన్ని పలువురు అభినందించారు.

# మానసిక ప్రశాంతత.. బలమైన ఆలోచనలకు పునాది

### ధ్యానంతోనే ఒత్తిడిని జయించవచ్చు

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15:నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ధ్యానాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. మానసిక ప్రశాంతత లేకపోతే ఏ పనినైనా సక్రమంగా చేయలేమని, ధ్యానం ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏకత్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహి స్తున్న దేవీనవరాత్రుల గుడకేష్ మెడిటేషన్ రిట్రీట్ కార్యక్రమం మూడో రోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానం, సూక్ష్మ యానం ద్వారా నిద్రపై నియంత్రణ సాధించడం, మానసిక ప్రశాంతతను పెంపొందించుకోవడం వంటి అంశాలపై గ్రాండ్ మాస్టర్ ప్రబోధ్ అచ్యుత చేస్తున్న కృషిని కీర్తిరెడ్డి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ఉదయం నిద్రలేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు అనేక ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ధ్యానం ఎంతో దోహదపడు తుందని తెలిపారు. రాజకీయ నాయకులుగా తమకు ఒత్తిళ్లు మరింత ఎక్కువగా ఉంటాయని, అందుకే తాను కూడా ప్రతిరోజూ ధ్యానం చేస్తానని, తద్వారా ప్రశాంతంగా ఉండగలుగుతున్నానని చెప్పారు. ధ్యానం కేవలం ఒక సాధన మాత్రమే కాదని, మనల్ని మనం తెలుసుకునేందుకు ఉపయోగపడే మార్గమని ఆమె అభిప్రాయపడ్డారు. విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకు, గృహిణుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరికీ ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, భావోద్వేగాలపై నియంత్రణ అవసరమని పేర్కొన్నారు. మానసికంగా ప్రశాంతంగా ఉండి ఆలోచించినప్పుడు పెద్ద సమస్యలనైనా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. మనిషి నిజమైన విజయం ఇతరులపై ఆధిపత్యం సాధించడంలో లేదని, తన ఆలోచనలు, భావోద్వేగాలను నియంత్రించుకోవడంలోనే ఉ ందని కీర్తిరెడ్డి అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపదల్లో యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన ముఖ్యమైనవని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషితో యోగా, ధ్యానంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ గొప్ప సంప్రదాయాల ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల్లో మానసిక ప్రశాంతతను పెంపొందించాలనే సంకల్పంతో ఏకత్వ ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తున్న గ్రాండ్ మాస్టర్ ప్రబోధ్ అచ్యుతకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# “నవ్వు పంచే వేషం.. మార్పు తెచ్చే సందేశం”

### పిట్టలదొర వేషంలో సామాజిక చైతన్యానికి శ్రీకారం

### డ్రగ్స్, గంజాయిపై అవగాహన చైతన్యం

### హాస్యంతో నవ్విస్తూ.. సందేశంతో ఆలోచింపజేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్

### షాద్‌నగర్ లో ప్రజలకు అవగాహన

సాధారణంగా పిట్టలదొర వేషం అంటే దసరా పండుగ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను నవ్విస్తూ, తనదైన మాటలతో వినోదాన్ని పంచే జానపద కళారూపం. అయితే ఆ కళారూపానికే సామాజిక బాధ్యతను జోడించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాల తెలుగు ఉ పాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్. పిట్టలదొర వేషధారణలో గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆయన చేపట్టిన అవగాహన కార్యక్రమం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. హాస్యంతో కూడిన సంభాషణలు, చమత్కారమైన మాటలతో ప్రజలను నవ్విస్తూనే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి కారణంగా కలిగే సామాజిక, ఆర్థిక, మానసిక, శారీరక అనర్థాలను తెలుసుకోవాలని సందేశాన్ని అందించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఎంచుకోవాలని పిట్టలదొర వేషంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అదే సమయంలో రోడ్డు భద్రతపై కూడా తనదైన శైలిలో సందేశాన్ని అందించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. నవ్విస్తూనే.. ఆలోచింపజేస్తూ.. వినోదం కోసం ఉపయోగించే పిట్టలదొర కళారూపాన్ని సామాజిక చైతన్యానికి వేదికగా మార్చడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలిచింది. సాధారణంగా పిట్టలదొర తన మాటల్లో గారడీ చేస్తూ ప్రజలను నవ్వించి, కొంత యాచనతో తన ప్రదర్శనను ముగిస్తాడు. కానీ రాచకొండ ప్రభాకర్ మాత్రం అదే వేషధారణను సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించే సాధనంగా మలిచారు. మాటల్లో హాస్యం ఉన్నప్పటికీ.. సందేశంలో మాత్రం సామాజిక బాధ్యత స్పష్టంగా కనిపించింది. ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో గంజాయి, డ్రగ్స్ నివారణ, రోడ్డు భద్రత అంశాలను వివరించడం ద్వారా తన ప్రచారానికి ప్రత్యేకతను తీసుకొచ్చారు. జానపద కళకు కొత్త అర్థం. మరుగున పడుతున్న జానపద కళారూపాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాలను అందించాలన్నదే తన ప్రయత్నమని రాచకొండ ప్రభాకర్ తెలిపారు. ప్రజలను ఆకట్టుకునే కళారూపాలను సామాజిక ప్రయోజనానికి వినియోగిస్తే మరింత ప్రభావవంతమైన చైతన్యం తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడటం, రోడ్డు ప్రమాదాలను నివారిం చేందుకు ప్రతి ఒక్కరిలో బాధ్యత పెంపొందించడం, అదే సమయంలో మన జానపద కళా సంపదను కాపాడుకోవడం? ఈ మూడు లక్ష్యాలతో రాష్ట్రవ్యాప్తంగా తన వంతుగా సామాజిక చైతన్య కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు రాచకొండ ప్రభాకర్ తెలిపారు. “నవ్వు పంచే వేషం. మార్పు తెచ్చే సందేశం”గా పిట్టలదొర వేషాన్ని మలిచిన రాచకొండ ప్రభాకర్ ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంది.




# మధుయాష్కి గౌడ్‌కు పోచబోయిన సురేష్ యాదవ్ శుభాకాంక్షలు

జ్యోతి ప్రభంజనం, ఎల్ బీ నగర్, ప్రతినిధి, అక్టోబర్ 15:ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్‌గా శ్రీ మధుయాష్కి గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్‌ను శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# గుత్తా అమిత్ రెడ్డి ప్రత్యేక పూజలు..

చిట్యాల, నల్లగొండ: అక్టోబర్ 15 (జ్యోతి ప్రభంజనం ):చిట్యాల పట్టణంలోని కనకదుర్గ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారిని లలితా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా మహిళలు కుంకుమార్చన చేశారు. రాష్ట్ర డైరీ కార్పోరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారి వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండేబోయిన శ్రీలక్ష్మి సైదులు, చిట్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ , గుత్తా యువసేన అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ డైరెక్టర్లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఘన నివాళులు

### ఆ మహనీయుని ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలి అధ్యక్షులు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్

మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూ టౌన్ చౌరస్తాలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న పురస్కార గ్రహీత, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ప్రసిద్ధి చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆఅఅ అధ్యక్షులు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళు లర్పించారు. సందర్భంగా అధ్యక్షులు అంగంపల్లి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ. ..డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి అని, తన అసాధారణ ప్రతిభ, క్రమశిక్షణ, నిరాడంబర జీవనం, దేశభక్తితో కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. శాస్త్రవేత్తగా దేశ రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో విశేష సేవలందించి, భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ దేశాల సరసన నిలిపేందుకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. భారత రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన సమయంలోనూ విద్యార్థులు, యువతకు ఎంతో చేరువగా ఉంటూ వారి భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపించారని పేర్కొన్నారు. యువత కలలు కనడమే కాకుండా, ఆ కలలను సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని కలాం అందించిన సందేశం నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. విజయం సాధించాలంటే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, క్రమశిక్షణతో, పట్టుదలతో, అంకితభావంతో నిరంతరం శ్రమించాలని సంజీవ్ ముదిరాజ్ అన్నారు. విద్య, విజ్ఞానం, కష్టపడే తత్వం, నైతిక విలువలతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కలాం విశ్వసించారని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని విద్యా, విజ్ఞాన రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు, ఆలోచనలు, స్ఫూర్తి భారతీయుల హృదయాల్లో చిరస్థాయి గా నిలిచిపోతాయని పేర్కొంటూ ఆయనకు ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శులు సత్తార్ చంద్రకుమార్ గౌడ్, రాములు యాదవ్, ఎం.ఏ. కలీమ్; టౌన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ; కార్పొరేటర్లు ఎంపీ ప్రవీణ్ కుమార్, ఫయాజ్, తాహెర్, గులాం జహీర్; జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆవేజ్, కాంగ్రెస్ నాయకులు గంజి అంజనేయులు, పీర్ మహమ్మద్ సాదిక్, రియాజుద్దీన్, బాసిత్, అడ్డాని హరినాథ్, గోపాల్ యాదవ్, అబ్రార్ హుస్సేన్, అజ్మత్, ఆశు, బిలాల్, మొహిజ్, ఉషారాణి, సహజ, నజీహా, దామోదర్ రెడ్డి, బూరెమోని చందు యాదవ్, నసీరుద్దీన్, రాజగోపాల్ గౌడ్, ఆలీం, చావ్ హుస్సేన్, ముస్తాక్ అలీ, నియాజ్, సేవాదళ్ నాయకులు జగదీష్, వెంకట్ లక్ష్మి, అలీ భాయ్, నాయకులు ఇమాద్ బాగ్ తదితరులు పాల్గొన్నారు.



# కిషన్‌నగర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన

### రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవనం..

### రూ.5 లక్షలతో అండర్‌డ్రైనేజీ పనులు

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం



కిషన్‌నగర్ గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి, రూ.5లక్షలతో చేపట్టనున్న అండర్‌డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామంలోని 160మంది నూతన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. దీంతో కిషన్‌నగర్ గ్రామంలో మొత్తం 940స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, అభివృద్ధి విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు. స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు పంచాయతీ భవనం, అండర్‌డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కిషన్‌నగర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్వో నాగయ్య, గ్రామ పెద్దలు కట్ట వెంకటేష్ గౌడ్, నల్ల నర్సింలు, ఉప సర్పంచ్ ముక్కు పోగుల ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు బాలరాజు గౌడ్, చందు నాయక్, సింగిల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, మల్లారెడ్డి గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆబ్కారీ శాఖలో 'మామూళ్ల' మోత!
# పంపకాల్లో కోతలు!




నల్గొండ స్థాయిని బట్టి వసూళ్లా? ఆరోపణలపై ఉన్నతాధికారుల నిఘా ఏది?ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కీలక శాఖల్లో ఆబ్కారీ శాఖ ఒకటి. మద్యం విక్రయాల నియంత్రణ, అక్రమ మద్యం రవాణా అరికట్టడం, నిబంధనల అమలును పర్యవేక్షించడం ఈ శాఖ ప్రధాన బాధ్యతలు. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆబ్కారీ శాఖలో మామూళ్ల వ్యవహారం స్థాయిని బట్టి సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో టెస్ట్ ఏమిటంటే ఈ ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ఎస్సైలు, కానిస్టేబుల్, హోంగార్డులు, శిక్షణ నిమిత్తమై వెళ్లిన వారి మామూళ్ల పైకము సైతం ఉన్నతాధికారులు మాకే కావాలంటూ వేధిస్తున్న సంగతులు గుసగుసలుగా వినబడుతున్నాయి .ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? వ్యవస్థలో జరుగుతున్నదేమిటి? అన్న ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.స్థాయిని బట్టి వ్యవహారం.. ఇదేనా పరిపాలనా తీరు?శాఖలోని కొందరు సిబ్బంది, అధికారులపై మామూళ్ల వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు ఉంటే వాటిని తేలికగా తీసుకోవడానికి వీల్లేదు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి వరకు ఎవరెవరి పాత్ర ఎంత? ఎక్కడైనా అక్రమ వసూళ్లు జరుగుతున్నాయా? నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారాలు సాగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. అయితే ఆరోపణలు వచ్చినంత మాత్రాన ఎవరినీ దోషులుగా నిర్ధారించలేం. ఆధారాలతో విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడమే నిజమైన పరిపాలనా బాధ్యత.ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా? ఆబ్కారీ శాఖలో పారదర్శకత లోపిస్తే దాని ప్రభావం ప్రభుత్వ ఆదాయంపైనే కాకుండా మద్యం విక్రయాల నియంత్రణపైనా పడే ప్రమాదం ఉంది. అక్రమ మద్యం విక్రయాలు, అనుమతుల ఉల్లంఘనలు, నిబంధనల అమలులో నిర్లక్ష్యం వంటి అంశాలపై అధికారులు నిరంతరం నిఘా పెట్టాలి. ఎవరైనా తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తే, అది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమే. ఉన్నతాధికారులు స్పందించాల్సిన సమయం!ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆబ్కా ఆప్కారి శాఖలో అంతులేని మామూళ్ల వసూలు పంపకాలను పంచాయతీలు బాహాటంగానే వినిపిస్తున్నాయని అందులో పనిచేసే ఉద్యోగస్తులే బయటకు తెలియపరుస్తుంటే ఇది వాస్తవమా కాదా అని కే 24 న్యూస్ తెలుసుకునేందుకుగాను చరవాణిలో ఉన్నతాధికారులను సంప్రదించగా ఎవరు స్పందించలేదు వారి యొక్క వివరణ చెప్పలేదు. ఏది ఏమైనాప్పటికీ నల్లగొండ ఉమ్మడి జిల్లాలో ఆప్కారి శాఖలో జరుగుతున్నటువంటి ఈ మామూలల్ల వ్యవహారాన్ని తక్షణమే పసిగట్టి పరిశీలించి దోషులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉండదని ప్రజలు కోరుతున్నారు.

# పదవి విరమణ చేసిన ఉద్యోగులకు వారి బెనిఫిట్స్ రాకపోవటంతో ఆగ్రహం

**కోహెడ్ చంద్రమౌళి అధ్యక్షుడు**
**కొంపెల్లి బిక్షపతి ప్రధాన కార్యదర్శి**

నల్గొండ ఈ ఏడాది 9719 రిటైర్డ్ ఉద్యోగులురిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆగ్రహం ప్రభుత్వం వడ్డీతో సహా బకాయిలు చెల్లించాలని డిమాండ్పదవీ విరమణ చేసి రెండున్నరేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో బకాయిలు అందడం లేదని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 2024 మార్చి నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపా ధ్యాయులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించడం లేదని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి బిక్షపతి ధ్వజమెత్తారు. బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్తో మంగళవారం రిటైర్డ్ ఉద్యోగులు రాష్ట్ర సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యో గులు, ఉపాధ్యాయులు హాజరైనట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సంద ర్భంగా సచివాలయం మీడియా పాయింట్ బయట వారు విలేకరులతో మాట్లాడారు. జీపీఎఫ్, జీఐఎస్, టీజీఎస్ఐ, లీవ్ ఎనాక్యాష్మెంట్, కమ్యూ టేషన్, గ్రాట్యుటీతో పాటు డీఏ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని పేర్కొ న్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. బకాయిలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు అనారోగ్యానికి గురైనా మెరు గైన వైద్యం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2026 మార్చి 31 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 25,943 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయగా, ఈ ఏడాది మరో 9,719 మంది రిటైర్ కానున్నారని సంఘం నాయకులు వెల్లడించారు. ఈ నెల 30వ తేదీలోగా బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపో వడంతో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు వివరించారు.

# 17వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు**



చౌటుప్పల్ అక్టోబర్ 15 చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలోని 17వ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను 17వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు మాట్లాడుతూ.. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు త్వరలోనే ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పేదలకు అండగా సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందని, ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందని అర్హులైన వారు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకొని కొత్త రేషన్ కార్డులు పొందాలని సూచించారు. ప్రజల సహకారంతో 17వ వార్డు అభివృద్ధి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సహకారంతో, వార్డు ప్రజల భాగస్వామ్యంతో 17వ వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తామని కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పలువురు నాయకుల పాల్గొనడంఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గుజ్జుల సురేందర్ రెడ్డి, జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెద్దగోని రమేష్ గౌడ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మాదాని గోపాల్, కాంశెట్టి భాస్కర్, ఐఎన్టీయూసీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల గణేష్ కుమార్, ఓర్సు రాజు, వీరమల్ల సత్తయ్య, బొజ్జ రాజు, రెవెన్యూ జీపీఓ నాగభూషణం, ధనలక్ష్మి, యర్రబోత్ దయాకర్ రెడ్డి, కళ్లెం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

సూర్యాపేట అక్టోబర్ 15 సూర్యాపేట జిల్లా కేంద్రంలో దుర్గామాత విగ్రహం వద్ద ఘనంగా పూజలు జరుపుకున్న మాజీ పర్యాటక చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూసంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 36వ వార్డులో కౌన్సిలర్ షేక్ మన్సూర్ బి ఫారూఖ్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. పురాతన దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సర్వ మతాల సారం ఒక్కటేనని చాటి చెప్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా ప్రజాపాలన కొనసాగిస్తుందన్నాడు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగయ్య,మురళి, మహేష్, రమేష్, శ్రీనివాస్



రెడ్డి, పిన్ని శ్రీనివాస్, పృథ్వి అయ్యప్ప, ఈశ్వర్,భక్తులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధనలో ప్రజలంతా భాగస్వాములు కావాలి



సూర్యాపేట సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రముఖ డాక్టర్ 18 వ వార్డు కౌన్సిలర్ వూ ర రామ్మూర్తి యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ రైతు బజార్ విగ్రహం వద్ద సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలో యాదవ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం రిలే దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. కొన్ని ఏళ్లుగా సూర్యాపేటకు రైల్వే మార్గం రావాలనా ప్రజల కలలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. శంషాబాద్ నుండి సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్చవద్దని యధావిధిగా మొదటి అలైన్మెంట్ నే కొనసాగించాలన్నారు. సూర్యాపేట విద్యా వైద్యం వ్యాపారంగంలో అభివృద్ధి చెందుతుందని బుల్లెట్ ట్రైన్ వస్తే మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కొంతమంది స్వార్ధపరుల స్వార్ధ రాజకీయాల కోసం సూర్యాపేటను బలి చేయవద్దని సూచించారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చేంతవరకు ఉద్యమం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో యాదవ విశ్రాంత ఉద్యోగాలు భయ్యా మల్లికార్జున్, దాసరి వెంకన్న హమీద్ ఖాన్ పాల్గొన్నారు.

# గ్రామాల్లో పట్టణాల్లో దసరా సందడి

నల్గొండ.మొదలైన పండుగ హడా వుడి.ఎక్కడ చూసినా పండుగ వాతావరణం. గ్రామీణ పల్లెల నుంచి పట్టణాల వరకు దసరా మామూలు దమాకా మొదలైంది. వీధివీధినా సందడి, మార్కెట్లలో రద్దీ, దుకాణాల్లో కొనుగోళ్ల హడావు డి. ఇలా ఎక్కడ చూసినా పండుగ కళ ఉట్టిపడు తోంది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల కలయికలు, పండుగ ఏర్పాట్లు ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. పల్లెల్లో ప్రత్యేక సందడిగ్రామాల్లో దసరా పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉంది. దేవాలయాల




వద్ద పూజలు, ఉత్సవాల ఏర్పాట్లు, కొత్త దుస్తుల కొనుగోళ్లు,బంధువుల రాకపోకలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పండుగ ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. సంప్రదాయాలు, ఆచారాలు, ఆత్మీయతల మధ్య పల్లె జీవనం పండుగ శోభను సంతరించుకుంటోంది. ఆనందాల దసరా. అందరికీ శుభదసరా! గ్రామమా.. పట్టణమా అన్న తేడా లేకుండా ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి. పండుగ సంబరాలు సామాన్యుల జేబులకు భారంగా మారకుండా, వ్యాపారులకు మేలు చేకూరుస్తూ, ప్రజలందరికీ సంతోషాన్ని పంచాలి. ఆర్భాటాల కంటే ఆత్మీయతకు, ప్రదర్శనల కంటే మానవత్వానికి ప్రాధాన్యమిచ్చినప్పుడే దసరా పండుగకు నిజమైన అర్థం చేకూరుతుంది. దసరా దమాకా మొదలైంది.. ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలి.. ప్రతి పల్లె పండుగ శోభతో కళకళలాడాలి.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501**, PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**